క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి



పూజలందుకుంటున్న పుష్పగిరి వేణుగోపాలస్వామి

జామి: మండలంలోని అన్నంరాజుపేట పంచాయతీ పుష్పగిరిలో ఎంతో పురాతన, ప్రసిద్ధి చెందిన వేణుగోపాలస్వామి శనివారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధానార్చకుడు ఫణిహారం సీతారామాచార్యులు భక్తుల గోత్రనామాలతో పూజలు జరిపించారు. భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

ఎరువులు దొరక్క అన్నదాతల ఇక్కట్లు



జామి పీఏసీఎస్ వద్ద ఎరువుల కోసం పడిగాపులు కాస్తున్న రైతులు

జామి: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ఎరువులు దొరక్కపోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. మూడు రోజులుగా పీఏసీఎస్‌కు, రైతుసేవా కేంద్రాలకు కాళ్లరిగేలా తిరుగుతున్నా ఫలితం ఉండడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ వద్ద శనివారం ఉదయం 7 గంటల నుంచి రైతులు ఎరువుల కోసం పడిగాపులు కాశారు. మధ్యాహ్న భోజనం మానుకుని ఉన్న ఎరువులు అందలేదని.. వచ్చిన కొద్దిపాటి ఎరువులు నేతల సిఫార్సుల మేరకు పక్కదారి పడుతున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రైతులకు ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

బొండపల్లి: గొట్లాం మాజీ సర్పంచ్ మీసాల తులసీరామ్ ఇటీవల మృతి చెందడంతో విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శనివారం గ్రామానికి చేరుకుని తులసీరామ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, ఎంపీపీ చల్లా చలంనాయుడు, పార్టీ మండల అధ్యక్షులు బొద్దల చిన్నం నాయుడు, వర్రి నరసింహమూర్తి, మహంతి రమణ, కర్రోతు శ్రీనివాస్, తదితరులున్నారు.

400 మందికి వైద్య పరీక్షలు

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి మోడల్ పాఠశాలలో 400 మంది విద్యార్థులకు కె.కొత్తవలస పీహెచ్‌సీ సిబ్బంది శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేసినట్లు ప్రిన్సిపాల్ ఈశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి మోసాలను.. ప్రజల్లోకి తీసుకెళ్లండి

- శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ
- హాజరైన జిల్లా పరిషత్ చైర్మన్, మాజీ ఎంపీ



చీపురుపల్లి రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ

చీపురుపల్లి రూరల్(గరివిడి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదమూడు నెలలు గడిచిందని.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఏ ఒక్కహామీ కూడా పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. గరివిడి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో చీపురుపల్లి మండల విస్తృత స్థాయి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా ఒక్కరికి కూడా పింఛన్ మంజూరు చేయలేదన్నారు. పైగా ఎంతోమంది అర్హులను తొలగించారని ఆరోపించారు. తల్లికి వందనం పథకం చాలా మంది విద్యార్థులకు వర్తించలేదన్నారు. కేంద్రియ విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులకు పథకం వర్తించకపోవడం అన్యాయమన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం పెడితే కూటమి ప్రభుత్వం హయాంలో నాసిరకం బియ్యం వినియోగిస్తున్నారని మండిపడ్డారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఒక్క స్కూల్ కూడా మూతపడలేదని.. కూటమి ప్రభుత్వంలో మాత్రం వందలాది పాఠశాలలు మూతపడడంతో సుమారు 3.8 లక్షల మంది విద్యార్థులు బడి మానేశారని చెప్పారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా రైతులకు ఎరువులు అందివ్వలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. డ్వాక్రా మహిళలకు జీరో వడ్డీ 13 నెలలుగా ఇవ్వలేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం వైఫల్యాలు.. ఎన్నికల హామీలు అమలు చేయకపోవడంపై 'బాబు ష్యూరిటీ – నో గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా ప్రజలకు వివరించాలని సూచించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనువాసరావు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందన్నారు. ఎన్నికల్లో మనం ఓడిపోలేదని.. మోసపోయామని చెప్పారు. మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఈ కూటమి నాయకులు వైఎస్ రాజశేఖర్ రెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన పథకాలకు పేర్లు మార్చారే తప్ప కొత్త పథకాలు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో ధీరా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొత్స సందీప్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు, మండల అధ్యక్షుడు మీసాల వరహాలనాయుడు, రాష్ట్ర రైతు విభాగం జనరల్ సెక్రటరీ దన్నాన జనార్ధన్, నియోజకవర్గం వలంటరీ విభాగం అధ్యక్షుడు బెల్లాన త్రినాథ్, నాయకులు పతివాడ రాజారావు, కరిమజ్జి శ్రీనివాసరావు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నమ్మించి మోసం చేశారు..



కెల్ల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు బొత్స సందీప్

గుర్ల: కూటమి నేతలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను నమ్మించి మోసం చేశారని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు, ధీరా ఫౌండేషన్ అధినేత బొత్స సందీప్ ఆరోపించారు. 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా మండలంలోని కెల్లలో శనివారం ఆయన ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. కెల్ల గ్రామంలోని ప్రజలకు గత ప్రభుత్వంలో రూ. 34 కోట్లు వివిధ సంక్షేమ పథకాల ద్వారా అందించామని తెలిపారు. కూటమి ప్రభుత్వం కనీసం కోటి రూపాయలు కూడా అందించలేకపోయిందని ఎద్దేవా చేశారు. ప్రజలు వాస్తవాలు గమనించి కూటమి నేతలను నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాట్నూరు సన్యాసినాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు బెల్లాన బంగారునాయుడు, జమ్ము స్వామినాయుడు, కెంగువ మధుసూదనరావు, బోళ్ల సుబ్రహ్మణ్యం, తోట తిరుపతిరావు, కెల్ల వెంకటరమణ, కెల్ల సూర్యనారాయణ, కెల్ల సురేష్, కెల్ల పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును మించిన మోసకారి లేడు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

- మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



హాజరైన పార్టీ శ్రేణులు

గజపతినగరం రూరల్: ప్రజలను మోసం చేయడం చంద్రబాబునాయుడుకు వెన్నతో పెట్టిన విద్య అని మాజీ శాసనసభ్యుడు బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు లేనిపోని హామీలిచ్చి అధికారం దక్కించుకున్నారన్నారు. సూపర్ సిక్స్‌లో భాగంగా ఏ ఒక్క హామీని అమలు చేయలేదని ఆరోపించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ చేసిన మోసాలను ఈ నెల 21వ తేదీ నుంచి మండలంలోని ప్రతీ గ్రామానికి వెళ్లి ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనందరిపైమ ఉందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ పథకాలు ఎక్కడా అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. ఆడబిడ్డ నిధి, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు ప్రయాణం, తదితర పథకాలను ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. పార్టీ మండలాధ్యక్షుడు బూడి వెంకటరావు మాట్లాడుతూ.. హామీలు అమలు చేయని నాయకులను నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల యువనాయుడు మండల సురేష్, ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, మండల యువ నాయకుడు కె.పైడపునాయుడు, వలంటీర్ల సంఘ మండల అధ్యక్షుడు కనకల సుబ్రహ్మణ్యం, వైఎస్ ఎంపీపీ కర్రి దేవి, కర్రి రామునాయుడు, బెల్లాన త్రినాథరావు, కామునాయుడు, సంగమయ్య, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే.. అందరికీ న్యాయం

- మాజీ ఎమ్మెల్యే కడుబండి



చంద్రబాబు సర్కారు చేసిన మోసాలను వివరిస్తున్న కన్వీనర్ కడుబండి

శృంగవరపుకోట: జగనన్న అధికారంలో ఉంటే అందరికీ న్యాయం జరిగేదని ఎస్.కోట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రేవళ్లపాలెం, సీతారాంపురం, గోపాలపల్లి గ్రామాల్లో పార్టీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్ నేతృత్వంలో నిర్వహించిన 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కడుబండి ప్రజలకు కూటమి నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన మేనిఫెస్టో వివరించి, ఎంత నష్టపోయారో వివరించారు. పలువురు మహిళలు మాట్లాడుతూ.. రేషన్ సరుకులు తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. ఆడబిడ్డ నిధి ఇవ్వలేదని.. ఉచిత బస్సు పథకం అటకెక్కిందని ఆరోపించారు. రైతులు మాట్లాడుతూ.. ఎరువుల కోసం మళ్లీ ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు మమ్ములూరి వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, ఎల్.కోట ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, జామి, వేపాడ మండలాల పార్టీ అధ్యక్షులు గొర్లె రవికుమార్, మమ్ములూరి జగన్నాథం, వాకాడ రాంబాబు, షేక్ రహమాన్, సర్పంచ్‌లు కె.వెంకటరావు, తగరంపూడి రమణ, జుత్తాడ సూర్యారావు, ఎంపీటీసీ సభ్యులు చప్ప లత, సన్యాసప్పడు, ఎం.సోంబాబు, కొట్యాడ శ్రీనివాసరావు, చప్ప గణేష్, భాస్కర్, తాతబాబు, చంద్రరావు, కృష్ణ, వెంకటరావు, అప్పడు, తదితర నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

పర్యావరణాన్ని కాపాడుదాం..

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్..



గజపతినగరం: నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, తదితరులు



చీపురుపల్లి: ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ అంబేద్కర్, ప్రజాప్రతినిధులు

గజపతినగరం: పాలిథిన్, ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగాన్ని తగ్గించి, పర్యావరణాన్ని కాపాడుకుందామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులు చేపట్టిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో డీపీఓ మల్లికార్జునరావు, ఎంపీడీఓ బి.కల్యాణి, ఎంఈఓ విమలమ్మ, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, సీనియర్ నాయకుడు ప్రదీప్‌కుమార్, జి.బంగారునాయుడు, సర్పంచ్ నరవ కొండమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనకు నడుం బిగించాలి : కలెక్టర్ అంబేద్కర్

చీపురుపల్లి: మానవ మనుగడకు ముప్పు కలిగిస్తున్న ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని కలెక్టర్ బీఆర్.అంబేద్కర్ పిలుపునిచ్చారు. స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా చీపురుపల్లిలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు వలిరెడ్డి శిరీష, మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, సీఈఓ సత్యనారాయణ, డీఎల్‌డీఓ హేమచంద్రరావు, తహసీల్దార్ డి.ధర్మరాజు, ఎంపీడీఓ ఐ.సురేష్, మేజర్ పంచాయతీ అధికారి ఝాన్సీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి.వేణుగోపాల్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, కూటమి నాయకులు రౌతు కామునాయుడు, గవిడి నాగరాజు, విజనగిరి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మీరా.. నీతులు చెప్పేది..?

- జనసేన నాయకుల తీరును ఎండగట్టిన వైఎస్సార్‌సీపీ నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: ప్రభుత్వాన్ని మోసం చేసిన ప్రబుద్ధులు రోడ్డెక్కి నీతులు మాట్లాడుతుంటే హాస్యాస్పదంగా ఉందని వైఎస్సార్‌సీపీ పట్టణ నాయకులు కొసిరెడ్డి రమణ, బలగ రమేష్, బూరాడ మహేష్, పతివాడ రాము, గవిడి సురేష్, పండు, తదితరులు ఎద్దేవా చేశారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్ వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ.. రైతుల కల్లాలకు.. పేదల కాలనీలకు వెళ్లే రోడ్డును దౌర్జన్యంగా తవ్వేసిన జనసేన నాయకుడు విజినిగిరి శ్రీను, ఆయనకు వంత పాడుతున్న వంగపల్లిపేట రాజు నీతులు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందన్నారు. ప్రభుత్వానికి భూములు ఇవ్వకుండా పరిహారం పొందిన వీరు నేడు నీతి, అవినీతి కోసం మాట్లాడడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందన్నారు. 1985లో మాంగనీస్ గనులకు ప్రభుత్వం భూములను లీజుకు ఇచ్చినప్పుడు కూడా రైతుల కల్లాలకు రోడ్డును మినహాయించినట్లు గుర్తు చేశారు. 2006లో మెట్టకాలనీలో 850 మంది పేదలకు ఇళ్లు ఇచ్చినప్పుడు ఇదే రోడ్డును ప్రభుత్వం గుర్తించిందని.. 2016లో టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులతో ఇదే రోడ్డును గ్రావెల్ రోడ్డుగా పటిష్టం చేయడం జరిగిందన్నారు. 2020లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇదే రోడ్డును ఆనుకుని 18 ఎకరాల భూములను ప్రభుత్వమే కొనుగోలు చేసి 693 మందికి పట్టాలు ఇచ్చి పక్కా ఇళ్లు నిర్మించడం జరిగిందన్నారు. అదే సమయంలో రూ.10 లక్షల ప్రభుత్వ నిధులతో ఈ రోడ్డుతో పాటు కాలనీలో రోడ్లు అభివృద్ధి చేసినట్లు చెప్పారు. అంతటి చరిత్ర కలిగిన రోడ్డు తమదేనంటూ ఇప్పుడు జనసేన నాయకుడు తవ్వేయడం సరికాదని తెలిపారు. ఇంతకాలం ఎక్కడున్నారో తెలియని పెద్ద మనుషులు ఇప్పుడు ప్రభుత్వం ఉంది కదా అంటూ వచ్చి పేదలను కష్టాలకు గురిచేసేందుకు పన్నాగం పనుతున్నారన్నారు. పేదలను ఇబ్బందులకు గురిచేస్తున్న ఇటువంటి నాయకులపై ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు దృష్టి సారించాలని కోరారు.

సంక్షిప్తంగా..

ఏఎంసీ చైర్మన్‌గా తాడ్డి



తాడ్డి చంద్రశేఖర్

మెరకముడిదాం: భైరిపురం ఏఎంసి చైర్మన్‌గా గర్భాం గ్రామానికి చెందిన తాడ్డి చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు విడుదలయ్యాయి. చిన్న వయసులోనే పదవి పొందడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

మార్కెట్‌యార్డు అభివృద్ధికి కృషి

గజపతినగరం: రానున్న రోజుల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వ్యవసాయ మార్కెట్ కమిటీని మరింత అభివృద్ధి చేస్తానని ఏఎంసీ చైర్మన్ పీవీవీ గోపాలరాజు అన్నారు. శనివారం స్థానిక ఏఎంసీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మంత్రి శ్రీనివాసరావు సహాయంతో యార్డును అభివృద్ధి చేస్తానని చెప్పారు. ఏఎంసీ వైస్ చైర్మన్ కోరాడ కృష్ణ, గంట్యాడ శ్రీదేవి, జానకీరామ్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి..

చీపురుపల్లి: పట్టణంలోని జి.అగ్రహారంనకు చెందిన కొంతమంది వ్యక్తులు తనతో పాటు తన భర్తపై దౌర్జన్యం చేసి, తాము నిర్వహిస్తున్న రెస్టారెంట్‌కు తాళాలు వేసి ఇష్టారాజ్యంగా దూషించారని, ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని పట్టణానికి చెందిన రేగాన శాంతిప్రియ కలెక్టర్ బీఆర్.అంబేద్కర్‌ను కోరింది. ఈ మేరకు శనివారం చీపురుపల్లి వచ్చిన కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది. తమపై జరిగిన దాడి విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయలేదని.. పెద్ద మనుషుల వద్ద రాజీ చేసుకోవాలని పోలీసులు సూచించారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చింది. కేసు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని బాధితురాలు కోరింది.

క్రీడా దుస్తుల పంపిణీ

శృంగవరపుకోట: మండలంలోని కొట్టాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు పి. భాస్కరరావు, కె. బంగారునాయుడు, టి. సింహాచలంనాయుడు, టి. శ్రీనివాసరావు, డీవీ సూర్యనారాయణ శనివారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు తమ సొంత నిధులు రూ. 50 వేలతో దుస్తులు కొని హెచ్‌ఎం విజయ్‌రామ్‌కుమార్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రహీం షేక్‌లాల్, వి.భాస్కరరావు, గోపీ, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల నిరసన

దత్తిరాజేరు: మండలంలోని సరయ్యవలస క్వారీ వద్ద కార్మికులు శనివారం నిరసన చేపట్టారు. పీఎఫ్, ఇన్సూరెన్స్ సౌకర్యాలతో పాటు ప్రభుత్వం నుంచి అందే ప్రోత్సాహకాలు అందించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పెదమానాపురం ఎస్సై ఆర్.జయంతి సంఘటనా స్థలానికి చేరుకుని కార్మికులకు నచ్చజెప్పి నిరసన విరమింపజేశారు.

నోట్ పుస్తకాల వితరణ

లక్కవరపుకోట: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు దాతలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సత్యసాయి దివ్యామృతం ఆధ్వర్యంలో శనివారం నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు సీహెచ్ కూర్మారావు, శ్రీనివాసరావు, హెచ్‌ఎం, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సాయం అందిస్తాం.. : న్యాయమూర్తి కనకలక్ష్మి

శృంగవరపుకోట: అర్హులకు న్యాయ సహాయం చేయడమే లక్ష్యంగా న్యాయసేవాసాధికార సంస్థ పని చేస్తోందని ఎస్.కోట మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి బి.కనకలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎం.సతీష్ అధ్యక్షతన స్వయం సహాయక సంఘ సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వార్షిక ఆదాయం రూ.3 లక్షలు దాటని పేదలకు న్యాయ సహాయం అందిస్తామన్నారు. సదస్సులో బీవీఎస్ రామారావు, బి.రామకృష్ణ, డబ్ల్యూఎస్.శర్మ, బి.సత్యనారాయణ, ఏజీపీటీవీఆర్ మూర్తి, బి.వెంకటరావు, వారాది ఈశ్వరరావు, అల్లు మహాలక్ష్మినాయుడు, పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

వేపాడ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఎంఈఓ బాల భాస్కరరావు ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం జరిగిన వేపాడ, సోంపురం క్లస్టర్ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ... విద్యార్థి వరుసుగా మూడు రోజులు పాఠశాలకు రాకపోతే ఉపాధ్యాయులు విద్యార్థి ఇంటికి వెళ్లి విషయం తెలుసుకోవాలన్నారు. వెంటనే పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల హెచ్‌ఎంలు ఎస్ఎస్ వల్లి, బీపీఏ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనే లక్ష్యం : డీఐజీ గోపీనాథ్ జెట్టీ

గజపతినగరం రూరల్: గంజాయి నిర్మూలకు ప్రణాళికలు రూపొందించామని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గజపతినగరం సర్కిల్ కార్యాలయాన్ని శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి, పెండింగ్ కేసులపై ఆరా తీశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మాదకద్రవ్యాలకు అలవాటు పడిన యువతను డీ అడిక్షన్ సెంటర్లకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ వకుల్ జిందల్, బొబ్బిలి డీఎస్పీ జి.భవ్యారెడ్డి, గజపతినగరం సీఐ జీఏవీ రమణ, ఎస్సైలు కిరణ్‌కుమార్, మహేష్, జయంతి, సీతారాం పాల్గొన్నారు.

అధికార పార్టీ అరాచకాలకు తలొగ్గితే సహించేది లేదు

- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల మండిపాటు



తహసీల్దార్‌ను నిలదీస్తున్న సభ్యులు

జామి: అధికార పార్టీ నేతలకు అధికారులు తలొగ్గితే చూస్తూ ఊరుకోమని వైఎస్సార్‌సీపీకి చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు స్పష్టం చేశారు. ఎంపీపీ సబ్బవరపు అరుణ అధ్యక్షతన శనివారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీశారు. గొడికొమ్ములో వైఎస్సార్‌సీపీ సర్పంచ్ పిల్లల భవానీకి చెందిన రేకుల షెడ్‌ను ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఎందుకు తొలగించారని సభ్యులు ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అరాచకాలు ఎక్కువయ్యాయని ఆరోపించారు. కొన్ని సంవత్సరాలుగా ఉన్న షెడ్‌ను ఉన్నట్టుండి ఒక్కసారిగా ఎందుకు తొలగించారు.. ఎవరి ఒత్తిళ్లతో తొలగించారో చెప్పాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు జెడ్పీటీసీ సభ్యురాలు గొర్లె సరయు, పలువురు సభ్యులు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయంలో జామి హైస్కూల్‌లో వన్ ప్లస్ తీసుకువస్తే.. కూటమి ప్రభుత్వం దాన్ని ఎత్తేసిందన్నారు. ఏఆర్ పేట సర్పంచ్ సీహెచ్ సూరిబాబు, తదితరులు మాట్లాడుతూ.. పొలాల్లోని మోటార్లు షార్ట్ సర్క్యూట్‌తో పాడవుతున్నా విద్యుత్‌శాఖ సిబ్బంది పట్టించుకోవడం లేదన్నారు. చింతాడ సర్పంచ్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు నాలుగు నెలలుగా జీతాలు ఎందుకు ఇవ్వలేదని ఉపాధి అధికారులను నిలదీశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.అప్పలనాయుడు, తహసీల్దార్ కృష్ణంరాజు, వైస్ ఎంపీపీలు గేదెల వెంకటరావు, ఎన్నింటి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ మార్చారు..



సాక్షిలో ప్రచురితమైన కథనం



కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న విద్యుత్ శాఖాధికారులు

సాక్షి ఎఫెక్ట్...

మెరకముడిదాం: మండలంలోని సోమలింగాపురం ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పాడవ్వడంతో ఈ నెల 18న సాక్షిలో 'ట్రాన్స్‌ఫార్మర్ మార్చండి మహాప్రభో' శీర్షికన వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. ఏపీఎస్ఈబీ ఏఈ దివాకరరావు ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్తులు సాక్షికి కృతజ్ఞతలు తెలియజేశారు.